సాక్షి కర్నూలు

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



అలరించిన కూచిపూడి నృత్యం

శ్రీశైలంటెంపుల్:ధర్మపథంలో భాగంగా మంగళవారం నిత్యకళావేదికపై విజయవాడ నాట్యాంజలి నృత్యాలయం కళాకారులు శైవగీతాలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది.



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో శనగల బసవన్నకు, బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.35
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 91.702
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,624
అవుట్ ఫ్లో	: 5,173

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షల్లో 90 శాతం హాజరు నమోదు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన 3వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు 90 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగగా 7,650 మందికి 6,892 మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో నలుగురు, రవీంద్ర డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇద్దరు మొత్తం 6 మంది విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు. డోన్‌లోని వైష్ణవి డిగ్రీ కళాశాల, సాయిశ్రీ డిగ్రీ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ సీఈ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించినట్లు వెల్లడించారు.

అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(సెంట్రల్): ఈనెల 11,12 తేదీల్లో ఏర్పడే అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రంజిత్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ముఖ్యంగా రైతులు కోతల సమయం కావడంతో వారిని అప్రమత్తం చేయాలని, తాత్కాలికంగా కోతలను వాయిదా వేయించేలా రైతులతో మాట్లాడాలని సూచించారు. కాగా, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, 08518-277305 నంబర్‌కు ఆపదలో ఉన్న వారు ఫోన్‌చేసి వివరాలు తెలపాలని ఆయన సూచించారు.

విజయవాడ వెళ్లిన కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మంగళవారం సాయంత్రం విజయవాడకు బయలుదేరారు. అక్కడ బుధ, గురువారాల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరుగనుంది. ఇందులో పాల్గొనేందుకు ఆయన వివిధ శాఖల నివేదికలతో వెళ్లారు.

ప్రాసిక్యూషన్ డీడీగా సరళాదేవి



కర్నూలు (లీగల్): జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా సి.సరళాదేవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మంగళవారం ఆమె స్థానిక ఏ-క్యాంప్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక నుంచి సరళాదేవి గ్రేడ్-1 పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మొదటి అదనపు జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తూనే జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా వ్యవహరిస్తారు. గత జూన్ నుంచి ప్రాసిక్యూషన్ డీడీగా కర్నూలు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.శ్రీనివాసులు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన సరళాదేవిని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రకాష్‌రెడ్డి, నరేంద్రనాథ్ రెడ్డి, ఎ.భాస్కర్, టి.సుస్మిత, బాలరంగస్వామి, కిశోర్‌లు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

కౌతాళం తహసీల్దార్ సస్పెన్షన్

కర్నూలు (సెంట్రల్): కౌతాళం తహసీల్దార్ మల్లికార్జున స్వామిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి. రంజిత్ బాషా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హాలహర్వి మండలం తహసీల్దారుగా పనిచేశాడు. ఆ సమయంలో నిట్ర వర్తి అనే గ్రామంలో ఒక వివాదాస్పద భూమిని నిబంధనలకు విరుద్ధంగా బాధితులకు కట్టబెట్టాడు. దీనిపై ఫిర్యాదు రావడంతో పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్‌తో కలెక్టర్ విచారణ చేయించారు. అందులో నిబంధనలు అతిక్రమించినట్లు తేలడంతో కౌతాళం తహసీల్దారు మల్లికార్జునస్వామిపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో నేటి (బుధవారం)నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు మొదలు కానున్నాయి. జిల్లాలో మొత్తం 2,252 పాఠశాలలుండగా 4,63,129 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6,8,10 వ తరగతులకు 9.15 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 7,9 తరగతులకు చెందిన విద్యార్థులకు 1.15 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రైవేటు స్కూళ్లకు మినహా మిగిలిన అన్ని యాజమాన్యాలకు చెందిన స్కూళ్లకు ఎంఆర్‌సీల నుంచి ప్రశ్నాపత్రాలు తరలించాలని విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. నేటి నుంచి ఈనెల 19 వరకు ఎస్‌ఏ-1 పరీక్షలు జరుగుతాయి. సాధారణంగా గతంలో దసరా సెలవుల ముందుకానీ, ఆ తరువాత కానీ ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహించే వారు. ఆరునెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది సకాలంలో పుస్తకాలు అందించలేకపోవడం, టీచర్ల ట్రైనింగ్స్‌తో స్కూళ్లలో తరగతుల బోధన పూర్తి చేయకపోవడంతో పరీక్షల నిర్వహణ ఆలస్యమైందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

ఒట్టి చేతుల్తో పంపిస్తున్నారు



ఆత్మకూరుకు చెందిన ఇతని పేరు మాబూసా. భార్య షాజహాబీకి కిడ్నీ సమస్య ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. నెఫ్రాలజి వార్డులో డాక్టర్లు చూసి మందులు రాసిచ్చారు. వాటిలో రెండు రకాలు మాత్రమే ఐదు రోజుల పాటు ఇచ్చి, మిగిలిన రెండు రకాలు బయట కొనుక్కోమన్నారు. కిడ్నీ సమస్యకు రాంటీడిన్, మెట్రోజిల్ మందులు ఏమి పని చేస్తాయో అర్థం కావడం లేదు. ఆర్థిక పరిస్థితి బాగా లేక పెద్దాసుపత్రిలో బాగా చూస్తారనుకొని ఆత్మకూరు నుంచి వస్తే లాభం లేకుండా పోయింది.

మందులన్నీ బయటకే రాశారు



ఈ యువకుడి పేరు అశోక్. శాంతినగర్‌కు చెందిన ఇతను మద్యపానం, దూమపానం అలవాటు మానేందుకు గత నెల 27వ తేదీన మానసిక విభాగంలోని డ్రగ్ అడిక్షన్ సెంటర్‌లో చేరి చికిత్స తీసుకున్నాడు. ఊపిరితిత్తుల్లో సమస్య ఉంటే ఆ విభాగానికి పంపించి చికిత్స చేయించారు. కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసి మందులు రాసిచ్చారు. వైద్యులు రాసిన దాంట్లో రెండు రకాల మాత్రలు మాత్రమే ఇచ్చారు. మిగిలిన మందులు మెడికల్‌షాపులో కొనాల్సి వచ్చింది. పాంటాప్, అజిత్రోమైసిన్, అంబ్రోక్సిల్ సిరప్‌లు కూడా ఇవ్వలేదు.



సర్కారు ఆస్పత్రులకు వచ్చేది పేదలు. ఈ విషయం తెలిసి కూడా కూటమి ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో ఎక్కడ చూసినా ప్రభుత్వాసుపత్రుల్లో మందులు నిండుకున్నాయి. ఈ కారణంగా రోగులు అధిక శాతం మందులను ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో 80 శాతం మందులు బయటకు రాస్తుండగా కర్నూలు జీజీహెచ్‌లో సైతం ఇదే పరిస్థితి. ఫలితంగా రోగుల జేబులకు భారీగా చిల్లు పడుతోంది.

మందులకు కటకట!

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత
- ఇన్సులిన్, యాంటీబయాటిక్స్, బీపీ మందులు బయటికే
- మొక్కుబడిగా మందులు ఇస్తున్న వైద్యులు
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోనూ దయనీయ స్థితి
- మందుల బడ్జెట్ తగ్గించిన రాష్ట్ర ప్రభుత్వం
- 20 శాతం బడ్జెట్ మందుల నిలుపుదలతో పరిస్థితి అగమ్యగోచరం
- స్థానికంగా కొనుగోలు చేసేందుకు అధికారుల చర్యలు



పెద్దాసుపత్రిలోని జీవనధార దుకాణంలో మందులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోని ఏరియా ఆసుపత్రి, ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి, ఐదు సీహెచ్‌సీలు, 35 పీహెచ్‌సీలు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు, 400లకు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. వీటన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ డ్రగ్ స్టోర్ ద్వారా మందులు పంపిణీ చేస్తుంది. ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా మందులు కొనుగోలు చేసి జిల్లా కేంద్రాలకు పంపి, అక్కడ నుంచి ఆసుపత్రులకు సరఫరా చేస్తుంది. ప్రతి మూడు నెలలకోసారి ఆయా ఆసుపత్రులు పెట్టిన ఇండెంట్ మేరకు మందులు సరఫరా అవుతుంటాయి. ఏప్రిల్, జూన్, సెప్టెంబర్, జనవరిలను క్వార్టర్‌లుగా విభజించారు. ఇందులో మూడవ క్వార్టర్ మందులు ఇప్పటి వరకు ఆయా ఆసుపత్రులకు చేరలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఒక క్వార్టర్ మందులు మాత్రమే అరకొరగా వచ్చాయి. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన మందులు అదనంగా ఉండటంతో రెండో క్వార్టర్‌కు ఇబ్బంది లేకుండా పోయింది. ఇప్పుడు అన్ని చోట్లా మందులు నిండుకున్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్యచికిత్స మినహా మందులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

పెద్దాసుపత్రిలో పరిస్థితి ఇదీ...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతి క్వార్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.60కోట్ల మందులను సరఫరా చేస్తుంది. ఏడాదికి రూ.10.40కోట్ల మందులు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండో క్వార్టర్ సమయానికి గతంలో ఉన్న మందులు స్టోర్‌లో నిల్వ ఉన్నాయి కాబట్టి పెద్దగా ఇబ్బంది లేకుండా పోయింది. మూడో క్వార్టర్ సమయానికి మాత్రం ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో ఆసుపత్రులకు 20 శాతం బడ్జెట్‌లో భాగంగా సరఫరా అయ్యే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. నెలరోజుల నుంచి దీని స్థానంలో నిధులు ఇవ్వలేదు. మందులు సరఫరా చేయలేదు. దీంతో కీలకమైన మందుల కొరత వేధించింది. మరోవైపు ఆసుపత్రిలో నిధుల లేమి వెంటాడుతోంది. ఇప్పుడు మూడో క్వార్టర్‌కు కూడా రెగ్యులర్‌గా ఇచ్చే రూ.2.60 కోట్లకు బదులు రూ. 2.20 కోట్ల బడ్జెట్ మాత్రమే కేటాయించింది. ఈ ఆసుపత్రికి ఏటా రోగుల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మందులు బడ్జెట్ పెంచాల్సింది పోయి తగ్గించడంపై వైద్యవర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

అందుబాటులో లేని మందులు ఇవే...

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ముఖ్యంగా షుగర్ రోగులకు ఇచ్చే ఇన్సులిన్ నిల్వలు అయిపోయాయి. ముఖ్యంగా సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లోనే రెండు నెలలుగా ఆ మందుల నిల్వలు జీరోగా చూపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులకు ఇన్సులిన్‌లను సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు అమాక్సిలిన్ మినహా ముఖ్యమైన యాంటిబయాటిక్స్ మందులు, ఇంజెక్షన్లు కొరతగా ఉన్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగంలో పెప్లాస్, మెరోపీనమ్, థయామైన్, టాక్సిమ్, ఈడీటీఏ వాక్యుటిన్స్, నాన్ ఈడీటీఏ వాక్యుటీన్స్ ఇంజెక్షన్లు, ఫోలిక్ క్యాథటర్స్ అస్సలే లేవు. జైలోకెన్, పాంటాప్, పారాసిటమాల్, సుటుప్యాక్, మెట్రోజిల్ ఇంజెక్షన్లు తక్కువ పరిమాణంలో ఉంచారు. అలాగే ఓపీలో పారాసిటమాల్, మెట్రోజిల్, డైక్లోఫెనాక్, మెట్రోజిల్ వంటి మాత్రలు మినహా ఇతర మందులు ఏవీ ఇవ్వడం లేదు. ఇన్సులిన్‌ను స్థానికంగా కొనుగోలు చేసి రోగులకు పరిమిత సంఖ్యలో నెలకు ఒకటి, రెండు చొప్పున పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా ఇమ్యునోగ్లోబ్లిన్స్ ఇంజెక్షన్ల కొరత తీవ్రంగా ఉంది. ఖరీదైన ఈ ఇంజెక్షన్లు కొనలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

మందుల కొనుగోలుకు ఆర్డర్ పెట్టాము



ఆసుపత్రికి 20 శాతం బడ్జెట్‌లో రావాల్సిన మందులకు సంబంధించి కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా ఆసుపత్రిలో మందుల కొరత ఏర్పడింది. రోగులు అవస్థ పడకుండా అత్యవసర మందులను వెంటనే కొనుగోలు చేయాలని సిబ్బందికి చెప్పాము. స్థానికంగా ఉన్న టెండరు దారుల నుంచి మందులు కొనేందుకు ఆర్డర్ కూడా పెట్టాము. రెండురోజుల్లో మందులు అందుబాటులోకి వస్తాయి.

–డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

- ముగిసిన ప్రపంచ టాయిలెట్ల దినోత్సవ అవగాహన కార్యక్రమాలు
- ఉత్తమ టాయిలెట్ల నిర్వహణకు పురస్కారాలు అందజేసిన కలెక్టర్



కార్మికురాలికి ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. మంగళవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో హమారా శౌచాలయ్-హమారా సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచిన కార్మికులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు చేపట్టిన ప్రపంచ మరుగుదొడ్ల అవగాహన కార్యక్రమాలు ముగిసినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించి వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్లను శుభ్రం చేసిన 10 మంది పారిశుద్ధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలు అందించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో టాయిలెట్లను వినియోగించేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాలలు, అంగన్వాడీలు, ఆసుపత్రుల్లో మరమ్మతులకు గురైన టాయిలెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. అనంతరం గూడూరు మండలం జూలకల్ గ్రామానికి చెందిన జె.వెంకటమ్మ, కర్నూలు మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన రెడ్డిపోగు సోమన్న, రేమటకు చెందిన ఎం.రత్నాకర్, వెల్దుర్తి మండలం బోగోలుకు చెందిన ఈ.లక్ష్మీదేవి, కలుగోట్లకు చెందిన పార్వతమ్మ, కల్లూరు మండలం తడకనపల్లెకు చెందిన షేక్ పర్వీన్, పెద్ద టేకూరుకు చెందిన కె.భిక్షు, గోనెగండ్ల మండలం గంజహాళ్లికి చెందిన సి.మహేశ్వరి, కున్నూరుకు చెందిన బి. కృష్ణవేణి, తుగ్గలి మండల కేంద్రానికి చెందిన రత్నమ్మకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

35,041 మంది రైతులు నష్టపోయారు

- రూ.25.24 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వండి
- ప్రభుత్వానికి నివేదిక పంపిన జిల్లా యంత్రాంగం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని రెండు కరువు మండలాలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెద్ద కడుబూరు, కౌతాళం మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ మండలాల్లో పంట నష్టంపై ఎన్యూమరేషన్ నిర్వహించిన వ్యవసాయ శాఖ 35,041 మంది రైతులు 14999.946 హెక్టార్లలో పంటలను కోల్పోయినట్లు గుర్తించింది. బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.25.24 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక పంపింది. కౌతాళం మండలంలో 21169 మంది రైతులు 9728.854 హెక్టార్లలో 33 శాతం కంటే ఎక్కువ స్థాయిలో పంటలను నష్టపోయారు. వీరికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.16.45 కోట్లు అవసరమవుతుంది. పెద్దకడుబూరు మండలంలో 13872 మంది రైతులు 5271.092 హెక్టార్లలో పంటలు నష్టపోయారు. వీరికి రూ.8.78 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. నష్టపోయిన పంటల్లో సజ్జ 62.8962 హెక్టార్లు, ఆముదం 186.6180, పత్తి 13949.2327, వేరుశనగ 745.4100, కంది 55.7894 హెక్టార్లలో ఉంది. అయితే, కరువు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడు విడుదల అవుతుందో తెలియని పరిస్థితి. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయడానికి రెండేళ్ల సమయం తీసుకుంది. ఇప్పుడు కూడా అలానే చేస్తుందేమోననే భయం రైతులకు పట్టుకుంది.

ఆదోని మెడికల్ కాలేజీలో పోస్టులు రద్దు

కర్నూలు (హాస్పిటల్): గతంలో జారీ చేసిన రెండు నోటిఫికేషన్లలో ఆదోని మెడికల్ కళాశాల, ఆదోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పోస్టుల భర్తీని రద్దు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దు చేసిన పోస్టుల వివరాలు, ప్రస్తుతం భర్తీ చేస్తున్న కర్నూలు, నంద్యాల మెడికల్ కళాశాలలు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, కర్నూలు గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల పోస్టుల ఖాళీలు, రోస్టర్ పాయింట్ల వివరాలు, కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్లు https://kurnool.ap.gov.in, https://nandyal.ap.gov.in, కర్నూలు మెడికల్ కళాశాల వెబ్‌సైట్ https://kurnoolmedicalcollege.ac.inలలో అభ్యర్థుల సమాచారం నిమిత్తం ఉంచామన్నారు.

అగ్నిప్రమాదంతోనే బాలిక మృతి

- టిన్నర్‌కు జెట్ కాయిల్ తగలడంతో మంటలు
- మంచానికి మంటలు వ్యాపించడంతో బాలిక సజీవ దహనం
- విలేకరుల సమావేశంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నందికొట్కూరు: స్థానిక బీఆర్ఆర్ నగర్‌లో సోమవారం ఇంటర్ విద్యార్థి మంటల్లో ఆహుతైన ఘటనకు అగ్నిప్రమాదమే కారణంగా పోలీసులు తేల్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట జెడ్పీ హైస్కూల్‌లో మృతురాలు, ఇదే ఘటనలో గాయపడిన యువకుడు 10వ తరగతి వరకూ కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత బాలిక నందికొట్కూరులోని తాత దగ్గర ఉంటూ స్థానికంగా ఓ కళాశాలలో ఇంటర్‌లో చేరింది. ఆ యువకుడు అప్పుడప్పుడూ ఆమె కోసం నందికొట్కూరుకు వచ్చేవాడు. ఈ క్రమంలోనే ఈ నెల 8వ తేదీ రాత్రి సుమారు 11 గంటలకు బీఆర్ఆర్ నగర్‌లోని బాలిక ఇంటివద్దకు యువకుడు వచ్చాడు. ఆ తర్వాత ఇద్దరూ స్టోర్ రూమ్‌లోకి వెళ్లి దోమల నివారణకు ఉపయోగించే జెట్ కాయిల్ అంటించుకొని నిద్రించారు. ఆ సమీపంలోనే పెయింట్‌లో కలిపే టిన్నర్ మూత లేకుండా ఉండింది. వీరు నిద్రిస్తున్న సమయంలో దుప్పటి ప్రమాదవశాత్తు టిన్నర్‌కు తగలడంతో అది కిందకు ఒలికి జెట్ కాయిల్‌కు తగలడంతో మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో నిద్రలో ఉన్న బాలికకు మంటలు అంటుకున్నాయి. అప్పటికే గది లోపల గడియ వేసుకోవడంతో వారు బయటకు రాలేకపోయారు. మంటలు పూర్తిగా వ్యాపించడంతో బాలిక శరీరమంతా కాలి అక్కడికక్కడే చనిపోయింది. గాయాలతో బయటపడిన యువకుడు ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటివరకూ చేసిన దర్యాప్తు మేరకు ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనగా తేలిందని ఎస్పీ తెలిపారు. అన్ని రకాల రిపోర్ట్స్ పెండింగ్‌లో ఉన్నందున అవి వచ్చిన తర్వాత కేసులో తదుపరి చర్య ఉంటుందని చెప్పారు. కాగా, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అంతకుముందు సంఘటనా స్థలాన్ని మరోసారి పరిశీలించారు. సమావేశంలో డీఎస్పీ రామాంజనేయులు నాయక్, సీఐలు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు తిరుపాల్, ఓబులేసు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు అండగా పోరుబాట

- ఆరునెలలైనా కూటమి సర్కారు ఎన్నికల హామీలు అమలు చేయలేదు
- 13 న అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ ర్యాలీ
- పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించలేదు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, నాయకులు కంగాటి శ్రీదేవి, మేయర్ బీవై రామయ్య



'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ నాయకులు సతీష్ తదితరులు

కర్నూలు (టౌన్): 'ఆరు నెలలు వేచి చూశాం. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఆర్‌బీకేలు లేవు. పంటకు గిట్టుబాటు ధర లేదు. అధికారం కోసం నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ఉద్యమించనున్న'ట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి సర్కారు నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. గతంలో అన్ని రకాల సేవలు ఆర్‌బీకేల్లో అందేవన్నారు. ఏటా రూ. 13,500 చొప్పున పెట్టుబడి సాయం రైతులకు వైఎస్ జగన్ సర్కారు ఇచ్చేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అంత కన్నా ఎక్కువగా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించి ఇప్పటి వరకు నయాపైసా ఇవ్వలేదని చెప్పారు. నాడు తమ అధినేత ఉచిత పంట బీమా అమలు చేసి రైతులను ఆదుకుంటే నేడు చంద్రబాబు ఆ పథకానికి ఏకంగా ఎసరు పెట్టారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఈ సమయంలో వారికి అండగా నిలబడేందుకు కూటమి సర్కారుపై వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సిద్ధమైందని తెలిపారు. ఈనెల 13వ తేదీ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి కర్నూలు ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తర్వాత జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి రైతు సమస్యలపై వినతి పత్రం అందజేస్తామన్నారు. రైతు వ్యతిరేకిగా మారిన కూటమి సర్కారు మెడలు వంచేందుకు చేపడుతున్న ర్యాలీలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రైతులు, ప్రజలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

టమాట రైతులు రోడ్డున పడ్డారు

కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు కర్షకులకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. పత్తికొండలో టమాట రైతులు రోడ్డున పడ్డారన్నారు. కష్టపడి పండించిన పంటను కిలో రూ.1 అడుగుతున్నారన్నారు. వారికి అండగా నిలబడటంలో సర్కారు ఘోరంగా విఫలమైందన్నారు. కర్నూలు మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ చెప్పింది చేయడం జగనన్న నైజం అయితే, చెప్పినదేది అమలు చేయని నైజం చంద్రబాబుది అన్నారు. ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకొని కూటమి సర్కారు లక్షల ఉద్యోగాలు ఇచ్చామని అబద్దాలు చెప్పడం తప్పా.. ఒక్క మేలు చేయలేదన్నారు. ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ లేదు..నిరుద్యోగ భృతి లేదన్నారు. పార్టీ కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. ఇటీవల కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం ప్రాంతాల్లో రైతులు, ప్రజలు వలసలు వెళ్లేందుకు ప్రభుత్వ పాలన తీరే కారణమన్నారు. అన్నివర్గాల ప్రజలను ఏకం చేసి సర్కారుపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో కర్నూలు నగర పాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, జుబేర్, షేక్ యూనుసు బాషా, క్రిష్ణ కాంత్ రెడ్డి, శ్రీనివాసరావు, పార్టీ నేతలు షరీఫ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీమఠంలో రేవంత్ సోదరుడు



పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనముల జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం మంత్రాలయం వచ్చారు. ఆయన ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆయనకు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.

థియేటర్‌లో యువకుల ఘర్షణ



స్టేషన్ ఎదుట బైఠాయించిన గిరిజన యువకులు

వెలుగోడు: పట్టణంలోని రంగమహల్ థియేటర్‌లో సోమవారం రాత్రి పుష్ప సినిమా షోలో రెండు వర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒక వర్గానికి చెందిన యువకుడిపై మరో వర్గానికి చెందిన యువకులు దాడి చేశారు. బాధిత వర్గ యువకులు మంగళవారం జమ్మి నగర్ వద్ద ప్రత్యర్థి వర్గంపై దాడి చేశారు. అనంతరం ఇరు వర్గాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయితే తమ ఫిర్యాదును ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని గిరిజన వర్గానికి చెందిన యువకులు ఎస్ఐ విష్ణు నారాయణను ప్రశ్నిస్తూ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. ఈ విషయమై ఎస్ఐ మాట్లాడుతూ ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

అధ్యాపకుడికి మెమో

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మోహన్‌నాయక్‌కు మెమో జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడమే గాకా ఫోన్ మాట్లాడుతుండగా మందలించిన ప్రిన్సిపాల్ పైనే దురుసుగా వ్యవహరించిన అధ్యాపకుడి విషయమై 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో ఆమె స్పందించారు. వివరణ కోరుతూ మెమో జారీ చేశారు. సంతృప్తికరమైన సమాధానం రాకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకోవడానికి విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

29న ఓపెన్ తైక్వాండో పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 29న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం పక్కన ఉన్న కర్నూలు క్లబ్‌లో షటిల్ కోర్టు ప్రాంగణంలో జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టీ.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో బాల బాలికలకు పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో వెంట తీసుకురావాలని తెలిపారు. ప్రతిభ చాటిన విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తామని తెలిపారు.

మల్లయ్యా.. గందరగోళం ఏందయ్యా!

- ఈనెల 3న స్పర్శ దర్శనాలు రద్దు చేస్తూ దేవస్థానం నిర్ణయం
- స్పర్శ దర్శనాలు పునరుద్ధరిస్తూ ఈఓ తాజా నిర్ణయం
- అయోమయంలో భక్తులు



శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో భక్తుల్లో గందరగోళం నెలకొంది. రోజుకో అధికారి, పూటకో నిర్ణయాలు తీసుకుంటూ ఉండటంతో అంతా అయోమయ పరిస్థితి నెలకొంది. ఈనెల 3న అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్ రద్దీ రోజుల్లో మల్లన్న స్పర్శ దర్శనాన్ని రద్దు చేసి భక్తులందరికీ అలంకార దర్శనాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇటీవల ఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎం.శ్రీనివాసరావు రద్దీ రోజుల్లో మూడు విడతల మల్లన్న స్పర్శ దర్శనాలను పునరుద్ధరిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీశైల మల్లన్న భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 7న వైదిక కమిటీ సభ్యులు, దేవస్థానం అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి, భక్తుల విజ్ఞప్తుల మేరకు రద్దీ ఎక్కువగా ఉండే ప్రభుత్వ సెలవు రోజులు, శని, ఆది, సోమవారాల్లో మూడు విడతలుగా స్వామివారి స్పర్శ దర్శనాలు కల్పించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే రద్దు చేసిన స్పర్శ దర్శనాలను పునరుద్ధరించారు. అయితే గత ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్ ఇదే వైదిక కమిటీతో చర్చించి స్పర్శ దర్శనాలు రద్దు చేసి సామాన్య భక్తులకు మల్లన్న దర్శనాల్లో పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. వారం రోజులు గడవకముందే గత ఈఓ నిర్ణయాన్ని రద్దు చేసి నూతన ఈఓ స్పర్శ దర్శనాలు పునరద్ధరించడంతో సాధారణ భక్తులు అయోమయంలో పడ్డారు.

భక్తుల విజ్ఞప్తి మేరకే పునరద్ధరణ

శని, ఆది, సోమవారాల్లో, ప్రభుత్వ సెలవు దినాలు మొదలైన రద్దీ రోజుల్లో నిర్దిష్ట వేళల్లో మల్లన్న స్పర్శ దర్శనానికి అవకాశం కల్పించాలని వచ్చిన విజ్ఞప్తుల మేరకే పునరద్ధరణ నిర్ణయం తీసుకున్నామని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసారావు తెలిపారు. మంగళవారం ఈఓ మాట్లాడుతూ సర్వదర్శనం క్యూలైన్లలోని సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోజుకు మూడు విడతల్లో స్వామివారి స్పర్శ దర్శనానికి అవకాశం కల్పిస్తామన్నారు. గతంలో మాదిరిగానే స్పర్శ దర్శనం టికెట్లను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పొందాలన్నారు.

దర్శనాల వివరాలు..

- ఉదయం 4.30 నుంచి 7.30 గంటల వరకు స్వామివారి అలంకార దర్శనం.
- ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు స్వామివారి స్పర్శ దర్శనం
- ఉదయం 9.30 నుంచి 11.45 గంటల వరకు స్వామివారి అలంకార దర్శనం.
- ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్వామివారి స్పర్శ దర్శనం
- మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామివారి అలంకార దర్శనం.
- సాయంత్రం 4 గంటలకు ఆలయ శుద్ధి
- సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు స్వామివారి అలంకార దర్శనం
- రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు స్వామివారి స్పర్శ దర్శనం.

నలుగురికి రిమాండ్

ఆళ్లగడ్డ: ఆస్తుల తగాదాలతో తల్లి, కొడుకుపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. నల్లగట్ల గ్రామంలో శనివారం రాత్రి నాగరాజు భార్య హైమావతి, కొడుకు మాధవ్‌లపై నాగరాజు అన్న వెంకటరమణ కుటుంబ సభ్యులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని వెంకటరమణ, అతని కొడుకు సాయి, భార్య మల్లేశ్వరిలతో పాటు మామ మద్దిలేటిలను మంగళవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరపచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ తెలిపారు

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

మద్దికెర: మండల పరిధిలోని మదనంతపురం గ్రా మంలో మంగళవారం ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి చేయడంతో ఏగుడురికి గాయాలయ్యాయి. గ్రామ పరిసరాల్లో రోజు మాదిరిగానే ఉపాధి పను లు చేస్తుండగా తేనెటీగలు దాడి చేయడంతో చిన్న మల్లికార్జున, నారాయణ, ఈశ్వరమ్మ, రంగమ్మ రా మాంజులు, కేశమ్మ, మద్దిలేటికి గాయాలు కావడంతో వారిని పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

31లోపు పీఎంశ్రీ స్కూళ్లలో పనులు పూర్తి కావాలి



మాట్లాడుతున్న ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల సొసైటీ సెక్రటరీ, సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య

కర్నూలు సిటీ: పీఎంశ్రీ కింద ఎంపికైన 52 స్కూళ్లను స్కూళ్లలో చేపట్టాల్సిన పనులను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల సొసైటీ సెక్రటరీ, సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య సమగ్ర శిక్ష ఇంజినీర్లను ఆదేశించారు. మంగళవారం డీఈఓ చాంబర్‌లో సమగ్ర శిక్ష అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా స్కూళ్లలో క్రీడా మైదానాలు, ప్రయోగశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.15 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నెల చివరిలోపు ఖర్చు చేస్తే వెంటనే రెండో విడత నిధులు మంజూరుకు అవకాశం ఉంటుందన్నారు. బిల్లుల అప్‌లోడ్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో జరుగుతున్న పనులపై సైతం ఆయన ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సంవత్సరం పూర్తయితే నిధుల సమస్య వస్తుందని, నిర్లక్ష్యం చేయకుండా పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ పని తీరుపై అధికారులను అడిగి తెలుసుకుని ఎక్కడెక్కడ పని చేయడం లేదో నోట్ చేసుకున్నారు. సమావేశంలో డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్, సమగ్ర శిక్ష ఇంజినీర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనుల నిలిపివేత



రైల్వే పనుల చార్ట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

హాలహర్వి: మండలంలోని చాకిబండ గ్రామ శ్మశానంలో చేపడుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను మంగళవారం నిలిపేశారు. పనులు ఆపాలని ఇటీవల సర్పంచ్ ఓబుళపతి ఆధ్వర్యంలో గ్రామస్తులు అధికారులను కోరారు. ఈక్రమంలో మంగళవారం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరింగ్ అధికారి రామప్రసాద్, రైల్వే సిబ్బంది గ్రామానికి చేరుకుని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. వారి విన్నపం మేరకు పనులను తాత్కాలికంగా నిలిపేస్తున్నామని ప్రకటించారు. తదుపరి పనులు గ్రామస్తులకు తెలియజేసిన తర్వాతే చేపడతామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నగేష్, వీఆర్వో పెద్దన్న, సర్పంచ్ ఓబుళపతి ఉన్నారు.

వేరుశనగ ఫెయిల్...కొర్ర పాస్!

- ఆర్గానిక్ పరీక్ష నిమిత్తం నమూనాల సేకరణ
- గుంటూరు ల్యాబ్ ఫలితాల విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): పురుగు మందులు, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (గ్యాప్) కార్యక్రమాలను వ్యవసాయ శాఖ చేపట్టింది. పత్తికొండ, ఆలూరు మండలాల్లో వేరుశనగలో గ్యాప్ పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాప్ పద్ధతులతో ఈ ఖరీఫ్‌లో పండించిన వేరుశనగలో ఆర్గానిక్ సర్టిఫికేషన్ అధికారులు వచ్చి రికార్డులను పరిశీలించి శాంపిల్స్ తీసి గుంటూరు ల్యాబ్‌కు తీసుకెళ్లారు. అక్కడ పక్షీక్షించగా అన్నింటిలోనూ కెమికల్స్ మోతాదుకు మించి ఉన్నట్లు నిర్ధారణ అయింది. గ్యాప్ పొలంబడి పద్ధతులతో పండించిన వేరుశనగలో ఆఫ్లాటాగ్జిన్ కెమికల్ మోతాదుకు మించి ఉన్నట్లు తేలింది. ఈ రెండు మండలాల నుంచి వెళ్లిన అన్ని శాంపిల్స్ ఫెయిల్ అయ్యాయి.

కొర్రలో కెమికల్స్ లేవని నిర్ధారణ

వెల్దుర్తి, తుగ్గలి మండలాల్లో గ్యాప్ పొలంబడి కార్యక్రమానికి అనుగుణంగా కొర్ర సాగు చేశారు. వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం, మండల కేంద్రమైన తుగ్గలిలో గ్యాప్ పద్ధతులకు అనుగుణంగా కొర్ర సాగు చేశారు. పంట ఉత్పత్తులు చేతికి వచ్చిన తర్వాత సర్టిఫికేషన్ అధికారులు వచ్చి వెల్దుర్తి మండలంలో 15, తుగ్గలి మండలంలో 3 శాంపిల్స్ తీసి గుంటూరు లాం ల్యాబ్‌కు పంపారు. అక్కడ పరీక్షించగా.. కెమికల్స్ లేవని నిర్ధారణ అయింది. అన్ని శాంపిల్స్ ల్యాబ్‌లో పాస్ అయ్యాయి. ఈ విషయాన్ని లాం ప్రయోగశాల సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చింది. త్వరలో కొర్రకు ఆర్గానిక్ సర్టిఫికెట్స్ రానున్నాయి. చిరుధాన్యమైన కొర్రలో సహజంగా కెమికల్స్ వినియోగం అతి తక్కువగా ఉంటుంది. కంది, వరిలో ఇంకా గ్యాప్ పొలంబడి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల: మండలంలోని పెద్ద కొప్పెర్లకు చెందిన ఓ వ్యక్తి మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. రేవనూరు ఎస్ఐ భూపాలుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బాలసుబ్బరాయుడు(55) బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. తిరిగి చెల్లించలేక పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బంధువులు గమనించి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు గోపాల్ (ఫైల్)

ఆదోని అర్బన్: స్థానిక ప్రశాంత్‌నగర్‌లో నివాసముండే మహాదేవ్, ఈరమ్మ దంపతుల కుమారుడు గోపాల్(28) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. గోపాల్ గోబీ స్టాల్ పెట్టుకుని జీవనం సాగించేవాడు. నాలుగేళ్లగా పద్మ అనే యువతిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా గోపాల్ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మహానంది: నంద్యాల-గిద్దలూరు రైల్వే మార్గంలో నందిపల్లె, నంద్యాల రైల్వేస్టేషన్ల మధ్యలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి రైలుప్రమాదంలో మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేనందున గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- 28 తులాల బంగారం రికవరీ



దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి పట్టణానికి చెందిన హనుమంతు కర్నూలుతోపాటు బళ్లారిలో ఇళ్ల దొంగతనాలకు పాల్పడ్డాడు. కర్నూలు శివారులోని రిచ్ మండ్ విల్లాస్‌లో నివాసముంటున్న నాగార్జున, విష్ణు టౌన్‌షిప్‌లో నివాసముంటున్న వెంకటేష్ ఇళ్లల్లో చోరీలు జరిగాయి. వేలి ముద్రల ఆధారంగా నిందితుడిని గుర్తించి పక్కా ఆధారాలతో హనుమంతును అదుపులోకి తీసుకుని విచారించగా అతని నేరాల చిట్టా బయట పడింది. అతని వద్ద నుంచి 28 తులా ల బంగారు నగలు స్వాధీనం చేసుకుని మంగళవారం కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఎదుట హాజరుపరిచారు. నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. హనుమంతుపై కర్ణాటక రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్లలో దొంగతనాల కేసులు ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. జల్సాలు, జూదం, వ్యభిచారానికి అలవాటు పడి దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. యజమానులు ఇంటి తలుపులు వేసి బయటకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు, డబ్బు ఇంట్లో ఉంచుకోరాదని డీఎస్పీ సూచించారు. సీసీ కెమెరాలతో పాటు వాచ్‌మెన్లు కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను సద్వినియోగం చేసుకుని దొంగతనాల నివారణకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్ఐలు గోపీనాథ్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అంతుచూస్తామని టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు

- లింగాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ సన్నాల రాధమ్మ



బాధితురాలు సర్పంచ్ సన్నాల రాధమ్మ

బండి ఆత్మకూరు: టీడీపీ నాయకులు తనను అంతు చూస్తామని బెదిరిస్తున్నారని మండల పరిధిలోని లింగాపురం గ్రామ సర్పంచ్ సన్నాల రాధమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి తలుపులు కొట్టి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఇదే విషయమై మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ జగన్‌మోహన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. తాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు కావడంతో గ్రామ అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ టీడీపీకి చెందిన నాగిరెడ్డి, షేక్ బాబు వేధిస్తున్నారన్నారు. పనులు చేసుకోవాలంటే తమ అనుమతి తీసుకోవాలని, లేకపోతే అంతుచూస్తామని, బిల్లులు మంజూరు కాకుండా చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఎస్సీ మహిళ అని కూడా చూడకుండా కులంపేరుతూ, అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వాపోయారు. కాగా కేసు నమోదు చేయకుండా ఎస్ఐ సర్దిచెప్పి పంపడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇదే విషయమై ఎస్ఐని వివరణ కోరగా ఫాల్స్ ఫిర్యాదు అంటూ కొట్టిపడేయడం గమనార్హం.

గుండె పోటుతో కూలీ మృతి

కృష్ణగిరి(వెల్దుర్తి): గుండె పోటుతో ఓ కూలీ మృతి చెందిన ఘటన మంగళవారం వెల్దుర్తి మండలంలోని బొమ్మిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయ రాముడు(46) లద్దగిరి రోడ్డు పక్కనున్న మిర్చి తోటలో మిరపకాయలు తెంచేందుకు వెళ్లాడు. అక్కడ ఉన్నట్లుండి చాతీలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ధర ఢమాల్

- మూడు రోజులుగా అమాంతం పడిపోయిన టమాట ధర
- 25 కేజీల జత గంపలు రూ.100 నుంచి రూ.200
- పెట్టుబడులు కూడా రావడం లేదని రైతుల ఆందోళన



పత్తికొండ మార్కెట్‌లో టమాట

పత్తికొండ(తుగ్గలి): గిట్టుబాటు ధరలు కల్పిస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం మాటల్లోనేనని తేలిపోతోంది. అసలే ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ప్రతికూల వాతావరణంతో దెబ్బతిని దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. టమాట పంటపై ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది. మూడు రోజులుగా టమాట ధరలు అమాంతం పడి పోయా యి. వాతావరణం ప్రతికూలం, అధిక వర్షాలు, తెగుళ్ల సోకి పంట దెబ్బ తినింది. ఉన్న పంటను అష్టకష్టాలు పడి వేలకు వేలు ఖర్చు చేసి కాస్త కాపాడుకున్నారు. అయితే ఒక్క సారిగా ధరలు పడిపోవడం రైతులను కలవరానికి గురి చేస్తోంది. సాగు చేసేందుకు పడిన కష్టం, పెట్టుబడులు అటుంచితే టమాటలు తెంచిన కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

కష్టం ఖర్చులకు కూడా రావడం లేదు..

పత్తికొండ పరిసర ప్రాంతాల్లో టమాట పండించిన రైతులు నిత్యం పత్తికొండ మార్కెట్‌కు తరలిస్తుంటారు. మార్కెట్‌లో టమాట ధరలు అమాంతం పడి పోవడం రైతులకు దిక్కుతోచడం లేదు. సోమవారం మార్కెట్‌కు దాదాపు 400 టన్నుల దాకా సరుకు రాగా 25 కిలోల గంప రూ.30 నుంచి రూ.70 వరకు ధర పలకడంతో రైతులు విస్తుపోతున్నారు. మంగళవారం ఈ ధర కాస్త మెరుగు పడింది. జత గంపలు రూ.100 నుంచి రూ.200 దాకా ధర పలికింది. టమాటాలు తెంచేందుకు ఒక్కో కూలీకి రూ.300 కూలీ ఇస్తున్నామని, మార్కెట్ తరలించేందుకు గంపకు రూ.20 చొప్పున ఆటో బాడుగ చెల్లిస్తున్నామని తెలిపారు. ఇంత కష్టపడి టమాట సరుకు మార్కెట్‌కు తీసుకొస్తే ధర లేకపోతే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో స్నర రూ.30కిపైగా విక్రయిస్తుండగా తమకు మాత్రం కిలోకు రూ.2 కూడా రావడం లేదని, పండించిన తమ కంటే దళారులకే లాభాలు వస్తున్నాయని రైతులు మండిపడుతున్నారు.

కిలో @ రూ.2

ప్యాపిలి: స్థానిక టమాట మార్కెట్‌లో మంగళవారం కిలో టమాట రూ.2 చొప్పున పలికింది. 25 కిలోల బాక్స్‌ను వ్యాపారులు రూ.50కి కొనుగోలు చేయడంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఖర్చులు కూడా చేతికిరాకపోవడంతో సరుకు వదిలి వెళ్తున్నట్లు రైతులు తిమ్మరాజు, రాజేశ్, సుంకన్న ఆవేదన వ్యక్తం చేశారు.

ఖర్చులు కూడా రాలేదు



ఎకరా పొలంలో టమాట సాగు చేశా. ప్రతికూల వాతావరణంలో పంటకు తెగుళ్ల సోకాయి. వాటి నుంచి వేలకు వేలు ఖర్చుచేసి పంటను కాపాడుకుంటే ఇప్పుడు ధరలు పడిపోయాయి. 10 గంపలు(గంప 25కేజీలు)మార్కెట్‌కు తీసుకెళితే రూ.400 వచ్చింది. ఆటో బాడుగ రూ.250, కమీషన్ రూ.40 పోను రూ.110 మిగిలింది. కూలీ ఖర్చులు కూడా రాలేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలి.

– పక్కీరప్ప, రైతు, గిరిగెట్ల

నాణ్యతను బట్టి ధర

మార్కెట్‌కు దాదాపు 400 టన్నుల దాకా టమాట సరుకు వస్తోంది. టమాట నాణ్యతను బట్టి ధర పలుకుతోంది. చిన్న గోలీ సైజు టమాట ధర తక్కువగా పలుకుతోంది. సరుకు బాగుంటే ధర కూడా ఉంటుంది.

– కార్నలిస్, మార్కెట్ యార్డు కార్యదర్శి, పత్తికొండ

ఎస్సీ ఉప-వర్గీకరణపై వినతుల స్వీకరణ

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డ్ కులాల్లోని ఉప-వర్గీకరణకు సంబంధించి ఏవైనా వినతులను 2025 జనవరి 9లోగా అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.తులసీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎస్సీ ఉప వర్గీకరణకు సంబంధించి విచారణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిందన్నారు. ఈ కమిషన్ కార్యాలయాన్ని విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం మొదటి అంతస్తు, కోనేరు లక్ష్మయ్య వీధి, మొఘల్రాజపురంలో ఏర్పాటు చేశారన్నారు. వర్గీకరణకు సంబంధించిన వినతులను కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోపు వ్యక్తిగతంగా కానీ, తిరుగు రసీదుతో రిజిస్టర్ పోస్టు ద్వారా లేక ఈమెయిల్ ఐడీ : omcscsubclassification@gmail.com ద్వారా సమర్పించవచ్చన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 106 మంది నిరుద్యోగులు హాజరు కాగా 52 మంది ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ పాల్గొన్నారు.



ఊరు ఉమెన్ అనుకున్నారా... నేషనల్!



ఆ ఊరి జనాభా పదకొండు వందలు కూడా ఉండదు. 'గ్రామాభివృద్ధికి జనాభా కాదు... చైతన్యం ప్రమాణం' అనుకుంటే చిల్లపల్లి చిన్న ఊరు కాదు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పెద్ద ఊరు. కేంద్ర ప్రభుత్వం 'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్' పురస్కారాలు ప్రకటించింది. అందులో 'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయితీ' విభాగంలో పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామపంచాయితీకి రెండో ర్యాంకు వచ్చింది. నేడు ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా చిల్లపల్లి గ్రామపంచాయితీ ఈ అవార్డులను అందుకోనుంది...

- చిల్లపల్లికి 'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయితీ'గా జాతీయ పురస్కారం
- నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

చిల్లపల్లి గ్రామంలో 1081 మంది జనాభా ఉండగా, అందులో 508 మంది మహిళలు ఉన్నారు. గ్రామంలో ఉన్న 33 స్వశక్తి సంఘాలలో 335 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ 'శ్రీ జ్యోతి గ్రామ సమైక్య సంఘం' ఏర్పాటు చేసుకుని రూ.3.35కోట్ల వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. రుణవాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించడమే కాకుండా పొదుపు ఖాతాల్లో సైతం డబ్బును జమ చేస్తున్నారు. కిరాణాషాపులు, కుట్టు మిషన్‌లు, కోళ్ల పెంపకం, పాడిగేదెలు, కంగన్‌హాల్, చికెన్ షాప్, బ్యూటీపార్లర్, టిఫిన్‌సెంటర్‌లు, డ్రాగన్ ఫ్రూట్స్ తోట, పిండిగిర్ని, కూరగాయల సాగు, విక్రయం, మెడికల్ షాపు, ఐకేపీ సెంటర్ నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడం... మొదలైన పనులతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు.

సక్సెస్ మంత్రం ఇదే...

కొన్ని గ్రామాల్లో మహిళ సంఘాలలోని సభ్యులు డబ్బులు పొదుపు చేసి, రుణాలు తీసుకొని బయట అధిక వడ్డీకి ఇవ్వడానికి ఇష్టపడతారు. దీనివల్ల సంఘాలకు, సభ్యులకు పెద్దగా ఉపయోగం ఉండదు. ఈ విషయాన్ని గ్రహించిన చిల్లపల్లి గ్రామ మహిళలు పొదుపు చేసిన డబ్బులతో పాటు, ప్రభుత్వం ఇచ్చే రుణాలను ఉపాధి కల్పన కోసం ఉపయోగిస్తున్నారు. దీనివల్ల తాము ఉపాధి పొందడంతో పాటు ఇతరులకు కూడా ఉపాధి చూపించగలుగుతున్నారు. రుణాలు తీసుకోవడంతో పాటు జీరో బకాయిలతో ముందుకు వెళుతున్నారు.

ఆర్థిక స్వావలంబన నుంచి ఆరోగ్య పరిరక్షణ వరకు చిల్లపల్లి ఆదర్శగ్రామంగా నిలుస్తోంది.

'గ్రామాల్లో ఉండడం దండగ' అనుకుంటూ ఉపాధి కోసం పట్నం బాట పడుతున్న ఎన్నో కుటుంబాలకు చిల్లపల్లి కొండంత ధైర్యాన్ని ఇస్తోంది. పట్టణంలో బతుకీడుస్తున్న వాళ్లను కూడా 'నేను నా ఊళ్లో హాయిగా బతక వచ్చు' అనుకునేలా భరోసా ఇస్తోంది. ఇంతకు మించిన విజయం ఏమిటి!

– గుడ్ల శ్రీనివాస్
సాక్షి, పెద్దపల్లి
ఫోటోలు: మర్రి సతీష్‌రెడ్డి

రైతు మిత్రులు



రమాదేవి, సరోజన, సౌజన్య... ముగ్గురు కలిసి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ధాన్యం వచ్చినప్పటి నుంచి తూకం వేసి మిల్లుకు తరలించే వరకు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ప్రతి క్వింటాకు ప్రభుత్వం ఇచ్చే రూ.32 కమీషన్‌తో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. రైతులకు చేదోడు వాదోడుగా ఉండడంతో పాటు ఐకేపీ సెంటర్‌ల ద్వారా ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆ ఊళ్లో రోజూ పండగే!

ఆర్థిక స్వావలంబనలోనే కాదు ఆరోగ్యం, పారిశుద్ధ్యంలోనూ చిల్లపల్లి ముందు ఉంటుంది. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉంది. బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్‌పై, తల్లిదండ్రులకు పేరెంటింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు ఈ చిన్న ఊళ్లో గాఢమైన నిశ్శబ్దం రాజ్యమేలేది. పెద్ద సందడి ఉండేది కాదు. ఇప్పుడు అలా కాదు. 'ప్రతిరోజూ మా ఊళ్లో పండగే. సందడే' అన్నట్లుగా కనిపిస్తుంది. అది మహిళా చైతన్యానికి సంకేతమైన సందడి!

మినీ ఏటీఎంతో....



డ్వాక్రా సంఘంలో చేరిన తరువాత సుమారు ఐదుసార్లు లోన్ తీసుకున్నాను. మొదటిసారి తీసుకున్నప్పుడు గేదెలు కొనుగోలు చేశాను. ఆ అప్పు తీర్చి మళ్లీ లోను ఎత్తుకుని పిల్లల చదువులకు ఉపయోగించాను. మరోసారి లోన్ ఎత్తుకొని సెంట్రింగ్ కర్రలు కొనుగోలు చేసి అద్దెకు ఇస్తున్నా. తరువాత మినీ ఏటీఎం నిర్వహించేందుకు ల్యాప్‌టాప్ కొనుగోలు చేసేందుకు లోన్ తీసుకున్నా. మినీ ఏటీఎం నిర్వహణతో నెలకు పదమూడు నుంచి పదిహేను వేల వరకు ఆదాయం వస్తుంది.

- కూర వనిత
మినీ ఏటీఎం నిర్వాహకురాలు

అందుకే ఆదర్శంగా నిలిచింది



పన్నెండేళ్ల క్రితం మహిళ సంఘంలో చేరాను. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆరు సార్లు రుణం తీసుకున్నా. మొదట్లో అయిదువేలు ఎత్తుకోని కుట్టుమిషన్ కొన్నాను. తరువాత లోన్లు తీసుకుంటూ మగ్గం, మెడికల్ షాపు ఏర్పాటు చేసుకున్నాను. స్త్రీనిధి కింద రూ.75వేలు తీసుకుని కిరాణాషాపు ఏర్పాటు చేసుకున్నాం. సంఘంలో లోన్ తీసుకోవడం, ఆ పైసలను సద్వినియోగం చేసుకోవడం, తిరిగి సకాలంలో చెల్లించడంలో మా గ్రామ సమాఖ్య ఆదర్శంగా నిలుస్తుంది.

- అరె.శ్వేత
మెడికల్ షాపు యజమాని


ఎన్నో గ్రామాలకు గెలుపు పాఠం



నలుగురు కలిస్తే ఎన్ని అద్భుతాలు సాధించవచ్చో నిరూపించింది చిల్లపల్లి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఏ వ్యాపారానికైనా ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం. ఈ విషయంలో చిల్లపల్లి మహిళలు పర్‌ఫెక్ట్‌గా ఉన్నారు. 'ఫ్రెండ్లీ ఉమెన్ విభాగం'లో జాతీయ అవార్డు రావటం సంతోషంగా ఉంది. అయితే ఇది ఒక ఊరి విజయం మాత్రమే కాదు ఎన్నో గ్రామాలకు గెలుపు పాఠం. 'మనం కూడా ఇలా చేసి విజయం సాధించవచ్చు' అని ప్రతి గ్రామం ధైర్యం తెచ్చుకునే విజయం.

- సంతోషం పద్మ,
ఏపీఎం, మంథని

న్యూస్‌మేకర్



పాయల్ కపాడియా

పుష్పా సరే పాయల్‌ని చూడండి

మన తెలుగు పుష్పా- 2 రికార్డు బద్దలు కొడుతోంటే అదే సమయంలో మన భారతీయ మహిళా డైరెక్టర్ 80 ఏళ్ల చరిత్ర గల గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో రెండు నామినేషన్స్ సాధించి రికార్డు స్థాపించింది. బెస్ట్ డైరెక్టర్ (మోషన్ పిక్చర్) బెస్ట్ మోషన్ పిక్చర్ (నాన్ ఇంగ్లిష్) కేటగిరీల్లో ఆమె దర్శకత్వం సినిమా 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' నామినేషన్ పొందింది. ఇంతకు ముందు ఇలాంటి ఘనత సాధించిన మన దేశపు మహిళ మరొకరు లేరు.



'సినిమా తీయాలంటే అందరికీ ఫిల్మ్ స్కూల్ అక్కర్లేదు. కాని నాకు ఉపయోగపడింది' అంటారు పాయల్ కపాడియా. ముంబైలో, ఆంధ్రప్రదేశ్‌లోని రిషి వ్యాలీలో బాల్యం, కౌమారం గడిచిన పాయల్ పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో డైరెక్షన్ కోర్సు చదివి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకురాలు అయారు. 2014 నుంచి సినిమాలు తీస్తున్నా 2021లో తీసిన డాక్యుమెంటరీ 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్'తో ఆమె ప్రతిభ లోకానికి పరిచయం కాసాగింది.

ఎవరికీ లేని ఘనత

ఆస్కార్ అకాడెమీ అవార్డ్స్‌తో సమానమైన ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డుల కోసం పోటీ పడే భారతీయ సినిమాలు చాలా తక్కువ. 1994లో చివరిసారిగా ఒక భారతీయ సినిమా నామినేషన్ పొందింది. ఆ తర్వాత ఇన్నాళ్లకు అదీ ఒక మహిళా దర్శకురాలిగా పాయల్ కపాడియా తాను తీసిన 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'తో 2024 గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ డైరెక్టర్', 'బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్' విభాగం కింద రెండు నామినేషన్స్ పొందారు. ఇప్పటికే కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024లో రెండవ ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ డైరెక్టర్ అవార్డును (గ్రాండ్ ప్రి) పొందిన డింపుల్ కపాడియా గోల్డెన్ గ్లోబ్ అవార్డు కూడా సాధిస్తే ఆమె పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలబడిపోతుంది.

సినిమాలు చూస్తూ...

పాయల్ కపాడియా బాల్యంలో రిషి వ్యాలీలోనే సినిమాల మీద ఆసక్తి పెంచుకున్నారు. 'మా అమ్మా నాన్నలు నాకు చిన్నప్పుడు ప్రగతికాముక సినిమాలు చూపించేవారు. రష్యన్, ఫ్రెంచ్ సినిమాలు... ఆనంద్ పట్వర్ధన్ తీసిన డాక్యుమెంటరీలు చూస్తూ పెరిగాను. ఆ తర్వాత పూణెలో డైరెక్షన్ కోర్సులో చేరాక వేరు వేరు ప్రాంతాల, నేపథ్యాల నుంచి వచ్చిన బ్యాచ్‌మేట్స్ సినిమాల గురించి ఎన్నో చర్చలు సాగించేవారు. రోజూ స్క్రిప్టులు వినడమే సరిపోయేది. అదంతా చిన్న ఎక్స్‌పోజర్ కాదు. అలాగే ఇష్టం ఉన్నా లేకపోయినా ప్రాక్టికల్స్ ఉండేవి. అవి చేసే ముందు కష్టంగా ఉన్నా చేశాక ఏదో తెలుసుకున్నాం అనే సంతృప్తి ఉండేది. ఉదాహరణకు అందరూ తప్పనిసరిగా 4 నిమిషాల లాంగ్‌షాట్ తీయాలి మా ప్రాక్టికల్ ఫిల్మ్స్‌లో. ఎవరు ఎలా తీస్తారనేది ఒక అనుభవం. మా ప్రొఫెసర్లు కూడా ఎంతో బాగా పాఠాలు చెప్పారు. అవన్నీ నేను దర్శకురాలు కావడానికి సాయం చేశాయి' అంటారామె.


ముగ్గురు స్త్రీలు, ఒక నగరం

మూడు నాలుగేళ్లుగా రాసుకున్న స్క్రిప్ట్ 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'ను తీయడానికి కావలసిన బడ్జెట్ కోసం ఫ్రాన్స్, ఇటలీ, లగ్జంబర్గ్, ఇండియా, నెదర్లాండ్స్‌లోని ప్రొడక్షన్ సంస్థలను ఆశ్రయించి వారి సహ భాగస్వామ్యంతో పూర్తి చేశారు పాయల్. కేరళ నుంచి ముంబైకి భుక్తి కోసం వచ్చిన ఇద్దరు నర్సుల కథ ఇది. వీరు పనిచేసే ఆస్పత్రిలోనే వంటమనిషిగా చేస్తున్న మహారాష్ట్ర మహిళ వీరితో కలుస్తుంది. ఆ నర్సుల్లో ఒకామె భర్త ఆమెను విడిచిపెట్టి జర్మనీ వెళ్లిపోయి ఉంటాడు. మరో నర్సు అవివాహితగా ఉంటూనే ఒక యువకునితో రిలేషన్‌లో ఉంటుంది. ఇక వంటామె ఇరవై ఏళ్లుగా తాను ఏ చాల్ (చిన్న కొట్టం)లో అయితే నివసిస్తోందో ఆ చాల్‌ను బిల్డర్ కూల్చడానికి వస్తే దానిని సొంతం అని చెప్పుకోవడానికి ఏ పత్రమూ లేక కలిగే నిస్పృహ... ఈ ముగ్గురి జీవితం ఎక్కడకు చేరుతుంది... ఏ వెలుతురికీ ప్రస్థానం అని చూపేదే కథ.

లోతైన కథనం

పాయల్ కపాడియా ఈ కథలో ఎన్నో పొరలు ఉంచి కథకు బహుముఖ పార్శ్వాలు ఇవ్వడమే ప్రపంచ విమర్శకులను ఆకర్షించి అవార్డుల పంట పండేలా చేస్తోంది. ఈ కథలో మూడు పాత్రలతో పాటు ముంబై నగరం కూడా ఒక పాత్రగా ఉండటం విశేషం. ఒక నగరం పెరిగే కొద్దీ పేదవాళ్లను దూరంగా నెట్టేస్తూ ఉంటుందని ఈ సినిమా చూపుతుంది. ఒకప్పటి మామూలు ఏరియా ఖరీదైన భవంతులతో నిండిపోతే అప్పటివరకూ అక్కడ ఉన్నవారు ఎక్కడకు వెళ్లి వుంటారు? ఎవరూ ఆలోచించరు. 'ఈ నగరం కలల నగరం అని కొందరు అనుకుంటారు. ఇది భ్రాంతుల నగరం. కలా నిజమా... తెలుసుకునే లోపే జీవితం గడిచిపోతుంది' అనే డైలాగ్ ఇందులో ఉంది. 'నువ్వు జీవితాన్ని తప్పించుకోలేవు' అనే డైలాగ్ కూడా ఉంది. తప్పించుకోలేని జీవితంలో తగిన ఆనందాలు వెతుక్కోవడం ఎలాగో ప్రతి జీవికీ తెలుస్తుంది. ఈ కథలోని ముగ్గురు స్త్రీలు ఆ ఆనందాలను వెతుక్కుని వెలుతురు పొందుతారు.

జనవరి 5న గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ఈవెంట్ ఉంది. చూద్దాం మన అదృష్టం.



ఎగతాళి నుంచి సంతాలి రుచుల దాకా...

మధుస్మిత సోరెన్ ముర్ము ఓ ట్రెండ్‌సెట్టర్. సంతాలి ఆదివాసీ వంటకాలను, ఇటాలియన్ వంటకాల శైలితో మేళవించి కొత్త రుచులను ఆవిష్కరిస్తోంది. సంతాలి సంప్రదాయ వంటల గురించి బ్లాగ్‌లో రాస్తోంది. కొద్దిరోజుల్లోనే ఓ సెలబ్రిటీ హోదాను సొంతం చేసుకుంది మధుస్మిత. బాల్యంలో ఎదురైన చిన్న చూపు నుంచి ఎదిగిన విజయ కిరణం ఆమె. ఒడిశాలోని మయూర్ భంజ్ జిల్లా, రాయ్‌రంగపూర్ అమ్మాయి మధుస్మిత.



మధుస్మిత



పోటీలో విజయం

ఆదివాసీల ఆహారపు అలవాట్లు నాగరక సమాజానికి భిన్నంగా ఉంటాయి. అడవుల్లో దొరికే చీమలు, నత్తలు, ఇతర కీటకాల వంటలు వారి ఆహారంలో ప్రధానంగా ఉంటాయి. లంచ్ బాక్సులో ఆమె ఆహారాన్ని చూసిన ఇతర విద్యార్థులు ఆమెను తక్కువగా చూసేవారు. అప్పటి నుంచి ఆమెలో తమ ఆహారపు అలవాట్లను నాగరకులు ఎందుకు తక్కువగా చూస్తారు... అనే సందేహం కలిగింది. ఆమెతోపాటే ఆమె సందేహం కూడా పెద్దదైంది. 'ఒడిశా హోమ్‌ఫుడ్ షెఫ్' పోటీల్లో గెలవడం మధుస్మితలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. తమ సంప్రదాయ వంటకాలను ఇతర ప్రాంతాల వంటకాల శైలితో మేళవించి వండడం అనే ప్రయోగం కూడా విజయవంతమైంది. బీటెక్ చదివేనాటికి ఆమెకు ఒక పరిష్కారం దొరికింది. ఆ పరిష్కారం విజయవంతం అవుతుందా లేదా అనే ప్రశ్నకు కోవిడ్ లాక్‌డౌన్ చక్కటి సమాధానాన్ని చెప్పింది. లాక్‌డౌన్ సమయంలో వంటల మీద పరిశోధనలు మొదలుపెట్టింది. లాక్‌డౌన్ తర్వాత సంతాలి వంటలు ఎన్ని రకాలున్నాయో తెలుసుకోవడానికి ఆ గ్రామాల్లో పర్యటించింది. ఎలా వండుతున్నారో తెలుసుకుంది. తెలుసుకున్న విషయాలను బ్లాగ్‌లో రాయడం మొదలుపెట్టింది. ఇప్పుడామె చెఫ్‌లకు శిక్షణనిస్తోంది. ప్రముఖ రెస్టారెంట్‌లలో సంతాలి తెగ వంటకాలు ప్రముఖ స్థానంలో కనిపిస్తున్నాయి. 2022లో మాస్టర్ షెఫ్ పోటీల్లో పాల్గొంది. ఆమె చేసిన రెండు వంటలు న్యాయనిర్ణేతల జిహ్వను మైమరిపించాయి. ఇటాలియన్ వంటకం పోలెంతాని మధుస్మిత స్థానిక పద్ధతిలో ఎర్రబియ్యంతో చేసింది. వేయించిన చికెన్‌కు తోడుగా ఎర్ర చీమల చట్నీ వడ్డించింది. అలాగే పాల్వా చట్నీతో పాట్లపీత వంటకం కూడా. ఎండిన చింతాకు పొడితో చేసిన వంటకాలను నగరవాసులు లొట్టలేసుకుని తింటున్నారు.

గవర్నమెంట్ ఉద్యోగం కంటే ఎక్కువ

''మా తల్లిదండ్రుల ఆలోచనలు చాలా సంప్రదాయబద్ధమైనవి. నేను బాగా చదువుకుని ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత గవర్నమెంట్ ఉద్యోగం చేయాలనుకునేవారు. కానీ నేను మాత్రం మా సంతాలి తెగ మీద సమాజంలో నెలకొని ఉన్న తేలిక అభిప్రాయాన్ని తొలగించాలనుకున్నాను. సంతాలి వంటకాలను తెలియచేసే ఫుడ్ బ్లాగర్‌గా ప్రపంచానికి పరిచయమయ్యాను. మా వంటలను పరిచయం చేశాను. ప్రపంచ పటంలో వంటకాల్లో ఇటలీకున్న స్థానంలో మా సంతాలి వంటకాలను చేర్చగలిగాను. పెద్ద పేరున్న రెస్టారెంట్‌లు మా వంటకాలకు మెనూ కార్డులో 'ట్రైబల్ క్విజిన్' అని ప్రత్యేక కేటగిరీ కల్పిస్తున్నారు. ఇప్పుడు మా సంతాలి వంటకాలు ప్రపంచ ఆహారపట్టికలో ఉన్నాయి. నేను అనుకున్నది సాధించాను'' అని సంతోషంగా చెప్తోంది 32 ఏళ్ల మధుస్మిత. బాల్యంలో మనసుకైన గాయంతో తమ సంతాలి తెగకు ప్రపంచస్థాయి గౌరవాన్ని తెచ్చి పెట్టింది మధుస్మిత సోరెన్ ముర్ము.

ప్రతిష్ఠాత్మక పదవిలో...



అనౌష్క కాలే

ఇరవై సంవత్సరాల బ్రిటిష్-ఇండియా స్టూడెంట్ అనౌష్క కాలే కేంబ్రిడ్జిలోని చారిత్రాత్మకమైన 'కేంబ్రిడ్జి యూనియన్ డిబేటింగ్ సొసైటీ' అధ్యక్షురాలిగా ఎన్నికైంది. కేంబ్రిడ్జి యూనివర్శిటీలో ఇంగ్లీష్ సాహిత్యం చదువుతున్న కాలే ఈ ప్రతిష్ఠాత్మక పదవిని చేపట్టిన అతి కొద్దిమంది దక్షిణాసియా మహిళల్లో ఒకరిగా నిలిచింది.

'ఎంతో చరిత్ర కలిగిన కేంబ్రిడ్జి యూనియన్ సొసైటీకి అధ్యక్షురాలిగా ఎన్నిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను' అంటుంది అనౌష్క.

వివిధ సాంస్కృతిక సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా యూనియన్‌లో మరింత వైవిధ్యాన్ని తీసుకువస్తాను అని చెబుతుంది. గ్లోబల్ డిబేట్స్‌పై తనకు ఉన్న ఆసక్తిని తెలియజేసింది. ఇంటర్నేషనల్ స్పీకర్స్‌కు ఆతిథ్యం ఇవ్వడంపై ప్రధానంగా దృష్టి సారించింది.

లీగల్

అవి ఒరిజినల్ దస్తావేజులతో సమానం

మేము 15 సంవత్సరాల క్రితం ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాటు కొన్నాము. ఇప్పుడు అమ్మాలి అనుకుంటున్నాము. అయితే కొన్ని సంవత్సరాల క్రితం మా ఒరిజినల్ దస్తావేజులు పోయాయి. మేము రెవెన్యూ ఆఫీసు నుంచి సర్టిఫైడ్ కాపీలను తీసుకున్నాము. ఆ కాపీల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అని కొనుక్కునే వారికి చెప్పగా వారు వెనుకడుగు వేస్తున్నారు. కొందరేమో 'కాగితాల పని మేము చూసుకుంటాము కానీ పాతిక లక్షలు తక్కువ ఇస్తాం..' అంటున్నారు. నాకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. దయచేసి పరిష్కారం చూపగలరు.

– విజయ్ వర్ధన్, వరంగల్

ఇంటి రిజిస్ట్రేషన్ / పూర్వ ఒరిజినల్ పత్రాలు లేనప్పుడు కొనేవారు కొంత సంకోచించడం సమంజసమే. ఒరిజినల్ దస్తావేజులని ప్రైవేటు వ్యక్తుల దగ్గర తాకట్టుపెట్టి తర్వాత అదే ఆస్తిని మరొకరికి అమ్మడం తరచుగా జరుగుతూ ఉంటుంది. ప్రైవేట్ తాకట్టు ఈ.సీ లో కూడా కనపడదు కాబట్టి కొనుక్కునేవారు అమాయకంగా మోసపోతూ తర్వాత కోర్టుల చుట్టూ తిరగడం సర్వసాధారణం అయిపోయింది. టైటిల్ డీడ్ డిపాజిట్ చేస్తే తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి అనే నిబంధన లేకపోవడం ఇందుకు కారణం.

ఒరిజినల్ దస్తావేజులు లేని కారణం చూపించి మార్కెట్ విలువ కన్నా తక్కువ ధరకు మాత్రమే కొంటాము అని చాలామంది అంటారు. ఒరిజినల్ పత్రాలు లేనంత మాత్రాన ఆ స్థలం కానీ, ఇల్లు కానీ మీది కాకుండా పోదు, మీకు మీ ఆస్తిని అమ్మే హక్కు లేకుండా పోదు! మీరు తక్షణమే మీ ఇంటి పత్రాలు పోయాయి అని పోలీసులకి ఫిర్యాదు ఇవ్వండి. అదే విధంగా మీరు ఒక లాయర్ ద్వారా పేపర్ ప్రకటన కూడా ఇవ్వవలసి ఉంటుంది. అలా ఇచ్చిన ప్రకటన కాపీలను మరలా పోలీసు వారికి అందించాలి. పోలీసు వారు 'ఫలానా వారి దస్తావేజులు పోయాయి, తిరిగి వెతికినా దొరకడం లేదు' అని ధ్రువీకరిస్తూ ఒక సర్టిఫికెట్ (నాన్ ట్రేసబుల్ సర్టిఫికెట్) జారీ చేస్తారు. ఆ సర్టిఫికెట్‌ను తీసుకొని మీరు రెవెన్యూ అధికారుల దగ్గర దరఖాస్తు చేసుకుంటే మీకు డూప్లికేట్ కాపీలు ఇస్తారు. అలా పొందిన పత్రాలు ఒరిజినల్ దస్తావేజులతో సమానం. మీరు వివరించిన పరిస్థితులలో అమ్మే వారికి - కొనేవారికి కూడా ఇది సురక్షితమైన పరిష్కారం.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

హక్కుల గొంతుక



హర్మీత్ కే ధిల్లాన్

భారత సంతతికి చెందిన లాయర్ హర్మీత్ కే ధిల్లాన్‌ను న్యాయశాఖ అసిస్టెంట్ అటర్నీ జనరల్(సివిల్ రైట్స్)గా నామినేట్ చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు.

'పౌరహక్కులను కాపాడడానికి హర్మీత్ గట్టిగా నిలబడింది. హర్మీత్ సమర్థవంతురాలైన న్యాయవాది' అని 'ట్రూత్' సోషల్ పోస్ట్‌లో రాశాడు ట్రంప్.

పంజాబ్‌లో పుట్టింది హర్మీత్ ధిల్లాన్. తండ్రి తేజ్‌పాల్‌సింగ్ ధిల్లాన్ ఆర్థోపెడిక్ సర్జన్. అతడు యూఎస్‌లో అడుగుపెట్టినప్పుడు హర్మీత్ చిన్నపిల్ల. తేజ్‌పాల్‌సింగ్ కుటుంబం నార్త్ కరోలినాలోని స్మిత్‌ఫీల్డ్‌లో స్థిరపడింది. 'డార్ట్ మౌత్ కాలేజీ'లో చదువుకున్న హర్మీత్‌కు హైస్కూల్ రోజుల నుంచి రచనలు చేయడం అలవాటు

కాలేజీ మ్యాగజైన్ 'ది డార్ట్ మౌత్ రివ్యూ'కు ఎడిటర్-ఇన్-చీఫ్‌గా పనిచేసింది. స్కూల్ ప్రెసిడెంట్, అతని విధానాలను విమర్శిస్తూ వ్యంగ్యాత్మక రచన చేసింది. వివక్షపూరిత విధానాల ప్రెసిడెంట్‌ను హిట్లర్‌తో పోల్చింది. ఈ సెటైర్ పెద్ద వివాదంగా మారింది.

'డార్ట్ మౌత్'లో చదువు పూర్తయిన తరువాత 'వర్జీనియా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ లా'లో చదువుకుంది. 'వర్జీనియా లా రివ్యూ' ఎడిటోరియల్ బోర్డ్‌లో పనిచేసింది.

అమెరికాలోని టాప్ ఎలక్షన్ లాయర్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న హర్మీత్ ధిల్లాన్ ట్రంప్ 2020 ఎలక్షన్ క్యాంపెయిన్‌లో లీగల్ అడ్వైజర్‌గా పనిచేసింది.